## బోసిపోయిన చాపరాయి

**ప్రజాశక్తి-డుంబ్రిగూడ:** గత మూడు రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండలంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. ఆదివారం చాపరాయికు పర్యాటకులు అధికంగా రాకపోవడంతో బోసి పోయింది. దీంతో, వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.

నిర్మానుష్యంగా ఉన్న చాపరాయి

# సిఐటియు నేతల గృహ నిర్బంధం

మాధవరావు, వెంకటలక్ష్మిలకు నోటీసులిస్తున్న పోలీసులు

**ప్రజాశక్తి - ఎటపాక** :జిఒ 1 రద్దు, ఇతర అంగన్వాడీ సమస్యలపై ఈనెల 20న సిఐటియు చలో విజయవాడ ఆందోళన నేపథ్యంలో ఆ కార్యక్రమానికి వెళ్లకుండా సిఐటియు మండల కార్యదర్శి డేగల మాధవరావును ఎటపాక పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఎటపాకలో తన నివాసంలో ఉన్న మాధవరావును ఎటపాక పోలీసులు స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం ఒంటి వరకు నిర్బందించి, తర్వాత సిఆర్‌పిసి 41 నోటీసులు ఇచ్చారు. ఆదివారం సాయంత్రం వరకు గృహ నిర్బంధంలో ఉండాలంటూ ఆదేశాలిచ్చారు.

ఈ సందర్భంగా డేగల మాధవరావు మాట్లాడుతూ నిర్బంధం, అరెస్టులతో ఉద్యమాన్ని అణచలేరని, ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలిపే కార్మికులను అరెస్ట్ చేయడం పిరికిపంద చర్య అన్నారు. ఎన్ని నిర్బంధాలు విధించినా అంగన్వాడీల ఛలో విజయవాడ విజయవంతమౌతుందన్నారు. ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించేవరకు సిఐటియు పోరాటం కొనసాగుతుందన్నారు.

**రాజవొమ్మంగి:** అంగన్వాడి ల సమస్యలు పరిష్కరించాలంటూ ఈనెల 20న సిఐటియు ఆధ్వర్యంలో తలపెట్టిన చలో విజయ కార్యక్రమం నేపథ్యంలో ఆదివారం సిఐటియు నాయకులు పి రామరాజు, అంగన్వాడీ యూనియన్ మండల నాయకురాలు కె.వెంకటలక్ష్మి ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చారు, వారితో బాటూ మరి కొంత మందికి నోటీసులు ఇచ్చి విజయవాడ ధర్నాలో పాల్గొనరాదని ఆదేశాలు జారీ చేశారు,ధర్నాకు ఎటువంటి పర్మిషన్లు లేవని నాయకులు,అంగన్వాడి వర్కర్లు ధర్నాకు వెల్లకూడదని తెలిపారు. ఈ చర్యలను పలువురు ప్రజా సంఘాలు నాయకులు లోతా రామారావు తదితరులు తీవ్రంగా ఖండించారు.

**అరకులోయరూరల్:**అంగన్వాడీలు చలో విజయవాడ పిలుపు ఇవ్వడంతో మండలంలోని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్‌ను ఇంట్లో నుండి బయటకు వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. విజయవాడ వెళ్తే అరెస్టు చేసి కేసులు పెడతామని భయభ్రాంతులకు గురి చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి, ఆశా కార్యకర్తలను ఇంట్లో నుండి బయటకు వెళ్లకుండా గృహ నిర్బంధం చేయడం సరికాదన్నారు. అంగన్వాడి ఆశ కార్యకర్తల సమస్యలు పరిష్కారం చేయాలని కోరితే గృహ నిర్బంధం చేయడం ఎంతవరకు సమంజసం మండిపడ్డారు.

బాలదేవ్ గృహ నిర్బంధం

## ప్రభుత్వం నిరంకుశ వైఖరి విడనాడాలి

### - సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

**ప్రజాశక్తి-పాడేరు:**

రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంభిస్తోందని అల్లూరి జిల్లా సిపిఎం కార్యదర్శి పి.అప్పలనర్స విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న విజయవాడలో మహాధర్నాకు పిలుపునిచ్చిన అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలను రాష్ట్రంలో పలుచోట్ల అరెస్టులు చేయడం, నోటీసులు ఇవ్వడాన్ని సిపిఎం జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో గృహ నిర్బంధాలు చేశారని, మహిళలని కూడా చూడకుండా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తుందన్నారు. సిఐటియు నాయకులను సైతం అరెస్టు చేశారన్నారు. జివో 1కి వ్యతిరేకంగా ఛలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన పౌరహక్కుల సంఘాల నాయకులు ముప్పాళ్ళ సుబ్బారావు సహా కార్యకర్తల్ని హౌస్ అరెస్టు చేశారని తెలిపారు. మంగళగిరి, తాడేపల్లిలలో సిపియం నాయకుల్ని అరెస్టు చేశారన్నారు. తమ న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించుకోడానికి విజయవాడ బయలుదేరుతున్న కాటికాపర్లు, శ్మశాన కార్మికుల్ని కూడా అరెస్టు చేస్తున్నారన్నారు. కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షుడను అడ్డుకున్నారని, ముఖ్యమంత్రి తిరువూరు పర్యటన సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లాల్లో అనేక మందిని అక్రమంగా అరెస్టు చేశారని, చనిపోయిన బంధువుల్ని పలకరించడానికి వెళు న్న వారిని కూడా అరెస్టు చేయడం దుర్మార్గ మన్నారు. ఇప్పటికైనా అప్రజాస్వామిక చర్యలకు స్వస్తి చెప్పి ప్రజల సమస్యలను వినాలని హితవు పలికారు. శాసనమండలి ఎన్నికల ఫలితాల తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వ వైఖరి మార్చుకోకుండా నిరంకుశ పద్ధతులతో ప్రజాగళాన్ని అణచివేయాలనుకోవడం అవివేకమని విమర్శించారు. తక్షణం అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని, నోటీసులను ఉపసంహరించు కోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# జిఒ 3కి చట్టబద్ధత కల్పించాలి

## యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ డిమాండ్

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ నేత

**ప్రజాశక్తి చింతూరు** : గిరిజన ప్రాంతాల్లో స్థానికులకే శతశాతం విద్య, ఉద్యోగావకాశాలు, ప్రమోషన్లు కల్పించే జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఆదివారం చింతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా అధ్యక్షులు వై విల్సన్‌బాబు అధ్యక్షతన అమరజీవి నాగాటి నారాయణనగర్‌లో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ముందుగా యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఎర్రం పేట నుండి చింతూరు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి గోపిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన విద్యను నిర్లక్ష్యం చేసిందని, ప్రాథమిక పాఠశాలలను పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు వెనుకబడిన ప్రాంతాల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థులు చదువుకు దూరం అవుతోందని ఆరోపించారు. గిరిజన ప్రాంతాల్లో 100శాతం పదోన్నతులు ఇవ్వాలంటే జిఒ3కు చట్టబద్ధత కల్పించాలన్నారు. పెండింగ్లో ఉన్న డిఎలు తక్షణమే చెల్లించాలని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయుల బదిలీలు జరపాలని, సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల ప్రమోషన్లు, పండిట్స్ పోస్టులను ఆపరేట్ చేయాలని డిప్యూటీ వార్డెన్ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.వెంకట్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, లోతా రామారావు, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు ఐ.వెంకటేశ్వర్లు తెలంగాణ రాష్ట్ర దుమ్ముగూడెం మండల అధ్యక్షురాలు పాల్గొన్నారు.

**యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక**

అనంతరం జిల్లా కౌన్సిల్ నూతనకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారిగా బి గోపిమూర్తి వ్యవహరించి ఎన్నిక నిర్వహించారు. నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా టి చిట్టిబాబు, అధ్యక్షుడుగా వై విల్సన్ బాబు, సహాధ్యక్షులుగా సిహెచ్ నాగేశ్వరరావు, ఎం కవిత, ప్రధాన కార్యదర్శిగా వి మహేశ్వరరావు, కోశాధికారి కె.కృష్ణ, కార్యదర్శులుగా పి కష్ణయ్య, కె. ఆదిరెడ్డి. కె.రఘునాథ్. ఎం ధర్మారావు., ఎం వెంకటనారాయణ, పి దేముడు, ఎస్ రాజబాబు, ఎస్ నాగేశ్వరరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎఫ్ డబ్ల్యూ ఎస్ డైరెక్టర్లు వై విల్సన్‌బాబు ఛైర్మన్ బి విశ్వరాజ్ ప్రధాన కార్యదర్శి ఎం వెంకన్న దొర కోశాధికారి బి దొరబాబు డైరెక్టర్ పి కన్నారావు వ్యవహరిస్తారు. ఈ కౌన్సిల్‌కు 19 శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

# జంతు సంరక్షణకు ప్రత్యేక ఏర్పాట్లు

### - ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాల ఇన్‌ఛార్జి క్యూరేటర్ అనంత శంకర్

**ప్రజాశక్తి - ఆరిలోవ**

**వేసవి నేపథ్యంలో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో జంతువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జూ ఇన్‌ఛార్జి క్యూరేటర్, డిఎఫ్‌ఒ అనంత శంకర్ తెలిపారు. సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలను, భవిష్యత్తులో జూ అభివృద్ధికి చేపట్టబోయే చర్యలను, జూ పార్కుకు తీసుకురానున్న కొత్త జంతువుల విశేషాలను ఆయన 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..**

**జంతువుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలేంటి ?**

వేసవిని దృష్టిలో ఉంచుకుని జంతువులను చల్లగా ఉంచేందుకు పలు ఏర్పాట్లు చేశాం. పాములు, పులులు తదితర జంతువులకు వాటర్ స్ప్రింకర్లు ఏర్పాటు చేశాం. హైనాలు, తోడేళ్లు, చింపాంజీలకు ఫ్యాన్లు, కూలర్లు అందుబాటులో ఉంచాం. పక్షులకు ఖుస్, ఖుస్ మ్యాట్‌లు ఏర్పాటు చేసి చల్లదనం కోసం ఎప్పటికప్పుడు నీళ్లతో తడుపుతూ ఉన్నాం. అన్ని జంతువుల నైట్‌హౌస్‌లకూ కూల్ రూఫ్‌లు ఏర్పాటు చేశాం. అన్ని ఎన్‌క్లోజర్లలో చల్లదనం కోసం చర్యలు చేపట్టాం. వెటర్నరీ వైద్యుల సూచనల మేరకు వేసవిలో జంతువులకు అందించే ఆహారంలో మార్పులు చేశాం.

**వేసవిలో సందర్శకుల కోసం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు ?**

వేసవి ప్రారంభం నుంచి జూ సందర్శకుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. హైవే, సాగర్ ముఖద్వారాల వైపు, చిరుతపులి ఎన్‌క్లోజర్ వద్ద, బయోస్కోపు వద్ద నాలుగు ఆర్‌ఒ ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. శుద్ధి చేసిన తాగు నీరు అందుబాటులో ఉంది. మండుతున్న వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పలుచోట్ల పగోడాలు, విశ్రాంతి స్థలాలు ఉన్నాయి. సందర్శకులు కూర్చునేందుకు కొత్త సిటింగ్ బెంచీలు ఏర్పాటు చేశాం. వీటితో పాటు పార్కులో కొన్ని ప్రదేశాల్లో సందర్శకులు సేదతీరేందుకుగానూ పెద్ద పెద్ద అంబ్రల్లాలు ఏర్పాటు చేస్తున్నాం. ఇవి కాకుండా క్యాంటీన్ సౌకర్యం, ఐస్‌క్రీమ్ పార్లర్లు వంటివి ఉండనే ఉన్నాయి. సందర్శకులు జూ చుట్టూ తిరిగేందుకు బ్యాటరీ వాహనాలు, ఈ-బైక్‌లు అందుబాటులో ఉన్నాయి.

**కొత్త జంతువులను తీసుకు రావడానికి ఏమైనా ప్రయత్నాలు చేస్తున్నారా ?**

జంతు మార్పిడి విధానం ద్వారా ఇప్పటికే కొత్త జంతువులను తీసుకొచ్చాం. ఈ విధానం ద్వారా మరిన్ని జంతువులను తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జపాన్ నుంచి గెయింట్ ఆల్‌బ్రా తాబేళ్లు, ఢిల్లీ జూ పార్కు నుంచి స్వాంప్ డీర్, హిప్పోపొటమస్, సంగటి డీర్‌లను తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. వరంగల్ జూ పార్కు నుంచి మౌస్ డీర్‌ను త్వరలో తీసుకురావాలని భావిస్తున్నాం. అదేవిధంగా గుజరాత్ నుంచి కూడా ఒక ఆడ సింహాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. వివిధ దేశాల నుంచి గ్రే కంగరూ, జీబ్రాలను తీసుకురాబోతున్నాం.

**జూపై పిల్లల్లో అవగాహన కల్పించేందుకు చేపడుతున్న చర్యలేంటి ?**

వన్యప్రాణుల పట్ల చిన్నారులకు అవగాహన కల్పించేందుకు ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాల పలు కార్యక్రమాలు చేపడుతోంది. వన్యప్రాణులకు సంబంధించిన ప్రత్యేక సందర్భాల్లో విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించి వ్యాసరచన, డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నాం. అదేవిధంగా అవుట్ రీచ్ యాక్టివిటీలో భాగంగా జూ ఎడ్యుకేషన్ టీం ప్రతి పాఠశాలకూ వెళ్లి వన్యప్రాణులపై అవగాహన కల్పిస్తోంది.

**జూ పార్కుకు కార్పొరేట్ సంస్థలు ఏమేరకు సహకారం అందిస్తున్నాయి ?**

జూ అభివృద్ధికి సిఎస్‌ఆర్ నిధుల ద్వారా కార్పొరేట్ సంస్థలు సహకారం అందిస్తున్నాయి. సిఎస్‌ఆర్ నిధుల్లో భాగంగా ఇప్పటికే ఐఒసిఎల్ రూ.1.88 కోట్లును జూ అభివృద్ధికి అందించింది. అదేవిధంగా గంగవరం పోర్టు రూ.10 లక్షలు, డెక్కన్ ఫైన్ కెమికల్స్ రూ.20 లక్షలు, గ్లాండ్ ఫార్మా రూ.10 లక్షలు జూ అభివృద్ధికి అందజేశాయి.

**జూ ప్రవేశ ధరల పెంపు ప్రభావం సందర్శకులపై ఎలా ఉంది ?**

సెంట్రల్ జూ అథారిటీ అనుమతులతోనే ఐదేళ్ల తరువాత జూ ప్రవేశ ధరలను పెంచాం. జూ పార్కులో సందర్శకులకు మరిన్ని సౌకర్యాలు పెంచేందుకే ఉన్నత స్థాయిలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై సందర్శకుల నుంచి పాజిటివ్‌గానే స్పందన వస్తోంది.

# గాలివాన బీభత్సం

## విరిగిన చెట్లు.. కూలిన రేకు షెడ్లు

## తెగిపడిన విద్యుత్ వైర్లు.. సరఫరాకు అంతరాయం

రామాలయం రహదారిలో విరిగిన చెట్లు

**ప్రజాశక్తి -చింతూరు.** : ఆదివారం తెల్లవారుజామున గాలి వాన బీభత్సానికి మండల కేంద్రంలో పలుచోట్ల భారీ చెట్లు విరిగి రోడ్డుకు అడ్డంగా పడ్డాయి. రేకుల షెడ్లు కూలిపోయాయి. ప్రధాన రహదారి పక్కన ఉన్న టేకు చెట్లు కొమ్మలు విరిగి దుకాణ సముదాయాలపై పడ్డాయి. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మామిడి కాయలు నేలరాలి తీవ్రనష్టం జరిగింది. పోలీస్ స్టేషన్ మీదుగా రామాలయానికి వెళ్లే రహదారిలో చెట్టు విరిగి రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు. గాలివాన బీభత్సానికి ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

తల్లులకు చెక్కును అందజేస్తున్న డిడి, ఎటిడబ్ల్యూఒ

## జగనన్న విద్యా దీవెన నగదు జమ

**ప్రజాశక్తి-పాడేరు టౌన్:** పిల్లల చదువుల నిమిత్తం తల్లుల ఖాతాలకు రూ. 4 కోట్ల 96 లక్షల 67 వేల నగదును రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి జమ చేశారని టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు అన్నారు. ఆదివారం ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరులో జగనన్న విద్యా దీవెన ప్రత్యక్ష ప్రసారాన్ని కలెక్టర్ కార్యాలయం నుండి అధికారులు, తల్లులు, విద్యార్థులు వీక్షించారు. కంప్యూటర్ బటన్ నొక్కి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 12,651 మంది తల్లులు ఖాతాకు విద్యా దీవెన నగదు జమ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి 1736 మంది బిసి విద్యార్థులకు రూ.97 లక్షల 47వేలు, 340 మంది ఎస్‌సి విద్యార్థులకు రూ.29 లక్షల 74వేలు, 11 మంది క్రిస్టియన్ మైనార్టీ విద్యార్థులకు 1లక్ష ఇరవై ఎనిమిది వేలు, 48 మంది ముస్లిం మైనార్టీలకు రూ.3 లక్షల 8వేలు, 10,516 మంది గిరిజన విద్యార్థులకు రూ.3 కోట్ల 65 లక్షలు 8వేలు నగదును తల్లులు ఖాతాలకు ప్రభుత్వం జమ చేసిందన్నారు. యాజమాన్యాలకు తల్లులు చెల్లించాలని సూచించారు. అనంతరం పాడేరు ఐటిడిఎ పరిధిలోని విద్యార్థులకు, తల్లులకు రూ.3 కోట్ల 65 లక్షల 8వేల నమూనా చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎటిడబ్ల్యూఒ ఎల్.రజిని, సూపరిండెంట్ శ్రీనివాసరెడ్డి, పలువురు తల్లులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## తూకాల్లో మోసం

**ప్రజాశక్తి-హుకుంపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పక్కనే ప్రతి ఆదివారం జరిగే చేపల దుకాణదారులు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. మాడుగులకు చెందిన దుకాణదారులు ప్రతి ఆదివారం ఉదయం చేపలు అమ్మకానికి చేపలు తీసుకుని వచ్చి అమ్మకాలు జరిపి వెళ్తూ ఉంటారు. ఇది ఇలా ఉండగా ఓ గిరిజనుడు చేపలు కొనుగోలు చేసేందుకు చేపల దుకాణం వద్దకు వెళ్లాడు. కిలో చేపలు తూకం వేసి దుకాణదారుడు ఇచ్చాడు. కిలోకు తూకం వేయగా రూ. 950 గ్రాములు తూకం వచ్చింది. కటింగ్ చేసి తుకం వేయగా 810 గ్రాములు తూకం వచ్చింది.తుకం లో అనుమానం రాగపక్కనే ఉన్న మంసం దుకాణం వద్దకు తుకం వేయగా 675 గ్రాములు చేప తూకం వచ్చింది. దీంతో మరల చేపల దుకాణదారుడు దగ్గరకు వెళ్లి కటింగ్ చేసిన చేప తూకం వేస్తే 810 గ్రాములు తూకం వచ్చిందని, కాటాలో 135 గ్రాములు బెట్టు చేయడంపై నిలదీశాడు. 1కెజి నుండి 5కెజి పైబడి చేపలు కొనుగోలు చేసే 250 గ్రాముల నుంచి 450 వరకు బెట్టు కాటాలో మోసాలకు పాల్పడుతున్నారు. డిజిటల్ కాటా వేసి కూడా సరైన తూకం తూయకుండా అమాయక గిరిజన ప్రజలకు మోసం చేయడం సరికాదని పలువురు తెలిపారు.ఇలా మోసాలు జరిగితే దుకాణాన్ని తొలగిస్తామని కొంతమంది గిరిజనులు హెచ్చరించారు.

# పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

## వర్ష నష్టాలను పరిశీలించిన సిపిఎం, గిరిజన సంఘాల నేతలు

**ప్రజాశక్తి -విఆర్ పురం** : అకాల వర్షాలతో పంటలను నష్టపోయిన బాధిత రైతులను ప్రభుత్వపరంగా పరిహారమిచ్చి ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. వర్షాలతో పంటలకు వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. ఆదివారం పలు గ్రామాలను సందర్శించి, వర్షాలతో నష్టపోయిన పంటను, కల్లాల్లో తడిసిపోయిన మిరపకాయలను పరిశీలించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, విఆర్ పురం, కూనవరం, ఎటపాక మండలాల్లో గోదావరి వరదలు కారణంగా ఆలస్యంగా వేసుకున్న మిరపపంటకు నల్లి పురుగు ఆశించడంతో పంటపై తీవ్రప్రభావం చూపి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దిగుబడులు గణనీయంగా తగ్గిన పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతుండగా, కాస్తోకూస్తో పండిన మిరపపంట ఇపుడు కల్లాలు మిరపకాయలు, పొలాల్లో మిరపపైర్లు తడిసి నష్టపోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు తక్షణమే గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని తెలుసుకుని . రైతులను ఆదుకోవడం ద్వారా భరోసా కల్పించాలని కోరారు. పంట నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కల్లాల్లో తడిసిన మిర్చికి మార్కెట్ ధర చెల్లించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. బాధిత రైతులకు పంటనష్టపరిహారం చెల్లించి ఆదుకునే చర్యలు చేపట్టేవరకు పోరాడతామని సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ హెచ్చరించారు.

కూనవరంలో కల్లాల్లో నీట మునిగిన మిరప కాయల కుప్పలు

**మిర్చి, పొగాకు రైతులను ఆదుకోవాలి**

అకాల వర్షంతో మిరప, పొగాకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం మండల కార్యదర్శి వడ్లాది రమేష్ కోరారు. వర్షంతో కల్లాల్లో తడిసిన మిర్చి కుప్పలు, ఎండబెట్టిన పొగాకును పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, పంట నష్టాలపై అంచనాలు వేసి, పరిహారం చెల్లించడం ద్వారా బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కుంజ నాగిరెడ్డి, మురళి, సుందరయ్య, సుబ్బయ్య రైతులు పాల్గొన్నారు

**కూనవరం :** ముంపు మండలాల్లో గోదావరికి వచ్చిన వరదలకు ఆలస్యంగా వేసిన పంటలు ఇపుడిపుడే చేతికి వస్తున్న తరుణంలో అకాల వర్షాలతో రైతులకు కంట నీరు తెప్పిస్తున్నాయని సిపిఎం మండల కమిటీ నాయకులు పాయం సీతారామయ్య తదితరులు కోరారు. ముంపు మండలాల్లో ఎక్కువగా పండించే మిర్చి, పొగాకు,మొక్కజొన్న పంటలకు ప్రస్తుత వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లిందని, కల్లాల్లోని మిర్చి కుప్పలు, పొగాకు తడిసి నీరు కారుతుండగా, పొలాల్లోని పైర్లలో నీరు నిలిచిపోయి ఉందన్నారు. పంటలను ఎండబెట్టుకోవడానికి, వర్షం వస్తే కప్పడానికి సబ్సిడీపై టార్పాలిన్లు ఇవ్వాలని అప్పట్లో మొరపెట్టుకున్నా స్పందన లేకపోవడంతో రైతులకు ఈ దుస్థితి నెలకొందన్నారు. బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు.కార్యక్రమంలో మేకల నాగేశ్వరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, ఆవుల మురళి పాల్గొన్నారు.

తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న సిపిఎం నేత కిరణ్

తడిసిన పొగాకును పరిశీలిస్తున్న రైతుసంఘం నేత రమేష్

## కేంద్ర హోంమంత్రి పర్యటనను నిరసిస్తూ మావోయిస్టుల భారీ ర్యాలీ

**ప్రజాశక్తి -చింతూరు.** : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బస్తర్ డివిజన్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పర్యటన నిరసిస్తూ సుకుమా జిల్లాలో మావోయిస్టులు నిరసన చేపట్టారు. బూటకపు ఎన్‌కౌంటర్లు నిలిపేయాలని, వైమానిక దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ భారీ సంఖ్యలో సాయిధ మావోయిస్టులు నినాదాలతో భారీర్యాలీ నిర్వహించారు.హిందూ ఫాసిస్ట్ విధానాలను విడనాడాలని, డ్రోన్ దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. దండకారణ్యంలో చేపట్టిన కూంబింగ్‌ను నిలిపేయాలని కోరుతూ కేంద్రమంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఇన్‌ఫార్మర్ నెపంతో అమాయక గిరిజనులను అరెస్టులు చేయడం మానుకోవాలని కోరారు. జల్, జంగిల్, జమీన్ ఆదివాసీల హక్కు అని, అడవిలో జీవించే హక్కు ఆదివాసీలకు మాత్రమే ఉందన్నారు. బస్తరులో హోంమంత్రి బస్ చేయడం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేశారు.

ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లాలో నిర్వహించిన మావోయిస్టుల ర్యాలీ

## వర్షంతో వారపుసంతకు అంతరాయం

**ప్రజాశక్తి -సీలేరు:** అల్పపీడన ద్రోణి ప్రభావంతో జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో రెండు రోజులుగా వర్షపు జల్లులు కురిసాయి. శనివారం రోజంతా కురిసిన చిన్నపాటి ఆదివారం వేకువజాము నాలుగు గంటల వరకు వీడకుండా కురిసింది. తర్వాత కాస్తా తెరిపినిచ్చినట్లు కనిపించినప్పటికీ మళ్లీ ఉదయం ఐదు గంటలకు మొదలై పది గంటల వరకు కొనసాగింది. తర్వాత తెరిపినిచ్చి ఎండకాసింది.

కాగా వర్షంతో ఆదివారం సీలేరు వారపుసంత ఉదయం పదిగంటల వరకు తెరుచుకోని పరిస్థితి. ముసురుపట్టిందా అన్నట్లు మబ్బులు కమ్మి, జల్లులు కురవడంతో స్థానిక వ్యాపారులు సైతం ఉదయం ఎనిమిది గంటల వరకు దుకాణాలను తెరవలేదు. పదిగంటల తర్వాత తెరిపినివ్వడంతో మెల్లగా దుకాణాలు తెరిచి వ్యాపారాలు ప్రారంభించారు. తర్వాత వర్షపుజాడ లేకపోవడంతో వ్యాపారులు, కొనుగోలుదారులు యథావిధిగా రావడడంతో సంతలో కార్యకలాపాలు కొనసాగాయి. పిల్లిగెడ్డ, దుప్పిలివాడ తదితర ప్రాంతాల నుంచి గిరిజనులు వారపుసంతకు కూరగాయలు మామూలుగానే తెచ్చి విక్రయాలు చేశారు. గిరిజన గ్రామాల నుంచి కొనుగోలుదారులు కూడా మామూలుగానే వచ్చారు. ఉదయం పదిగంటల తర్వాత మొదలైన సంత యథావిధిగా సాగింది.

## ఆయుర్వేద వైద్యుడు జమాల్ ఖాన్‌కు సన్మానం

**ప్రజాశక్తి -చింతూరు** : ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జమాల్ ఖాన్ సేవలను గుర్తించి ఎటపాక మండలంలోని ఆయుర్వేద ఆసుపత్రి వద్ద ఆదివారం హైదరాబాదుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోటేశ్వరరెడ్డి ఘనంగా సత్కరించారు. కొన్నేళ్లుగా మోకాళ్ల నొప్పులు, సుగర్, బీపీలతో బాధపడుతున్న తనతోపాటు ప్రమాదవశాత్తు కింద పడడంతో వెన్నెముకకు గాయమై నడవలేని స్థితిలో ఉన్న తన భార్యకు ఆయుర్వేద వైద్యం అందించి నయం చేసిన డాక్టర్ జమాల్‌ఖాన్‌కు రుణపడి ఉంటామని పేర్కొంటూ సత్కరించారు. సోషల్‌మీడియా ద్వారా డాక్టర్ జమాల్‌ఖాన్ గురించి తెలుసుకుని, హైదరాబాద్ నుంచి వచ్చి వైద్యం పొందామని, ఇపుడు పూర్తిగా స్వస్థత చేకూరిందని కోటేశ్వరరెడ్డి వెల్లడించారు. తమలాగా మరెందరో అనేక వ్యాధులతో సమస్యలతో బాధపడుతున్నారని వారిని కూడా ఆయుర్వేద వైద్యం ద్వారా తగ్గించి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని వేడుకొన్నారు. వై సుధాకర్ రెడ్డి మహబూబాబాద్ ఎంపి వియ్యంకుడు వై.సురేందర్ రెడ్డి జమాల్ ఖాన్‌ను కలిసి సుగర్, బిపి, చర్మవ్యాధుల మందులను వాడి తగ్గించుకున్నానని తెలిపారు.

డాక్టర్‌ను సత్కరిస్తున్న కోటేశ్వరరెడ్డి

# అంతర్మథనం

### ప్రచారం చేసినా కానరాని ఫలితం
### వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి ఓటమి
### రాజకీయ భవితవ్యంపై నేతల్లో ఆందోళన

**ప్రజాశక్తి-రావికమతం:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు అధికార పార్టీకి వ్యతిరేకంగా వెలువడటంతో అధికార పార్టీకి చెందిన నాయకులు బయటకు గాంభీరం ఉన్నా లోలోన అంతర్మథనం మొదలైంది. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన ప్రారంభమైంది. సార్వత్రిక ఎన్నికలకు ఏడాది కాలం మాత్రమే ఉండటంతో ఎమ్మెల్సీ ఓటమి తమ భవిష్యత్తును ఎటువైపు మళ్లిస్తుందోనని ఆలోచనలో మునిగిపోయారు. ఉత్తరాంధ్రలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకున్నారు. 2019 ఎన్నికలలో వ్యక్తిగత గెలుపు కోసం పడిన శ్రమకు మించి అధికార పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును గెలిపించేందుకు చోడవరం నియోజకవర్గంలో నేతలు ఎంతగానో శ్రమించారు. పట్టభద్రుల ఎన్నికల నోటిఫికేషన్ రాక ముందు రెండు నెలల ముందు నుంచి నియోజకవర్గంలోని చోడవరం, బుచ్చయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాలలో స్థానిక శాసనసభ్యులు కరణం ధర్మశ్రీతో పాటు ఈ నియోజకవర్గానికి ఇన్చార్జిగా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్సీ కోలా గురువులు, నాలుగు మండలాల ఎంపీపీలు, జడ్పిటిసిలు సర్పంచులు, ఎంపిటీసీలు, వైస్ ఎంపీపీలతో పాటు మండల పార్టీ నాయకులు, అధ్యక్షులు అలాగే నూతనంగా నియమించిన ఎమ్మెల్యే ప్రోగ్రాం కోఆర్డినేటర్లు, మండల కోఆర్డినేటర్లు, గ్రామ కోఆర్డినేటర్లు, గృహసారథులు వీరంతా ప్రచారం చేపట్టారు. గ్రామాల వారీగా పట్టభద్రుల ఓటర్లను నమోదు చేయించారు. ఓటర్ల వివరాలను ఎప్పటికప్పుడు తరచూ గ్రామాల వారీగా కోఆర్డినేటర్లు కోఆర్డినేట్ చేస్తూ పనిచేశారు. దీనిలో భాగంగా పరిపాలన రాజధాని విశాఖకు తరలింపుపై నిరుద్యోగులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. లక్షల కోట్లతో ఉత్తరాంధ్రలో పరిశ్రమలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తామంటూ ప్రచారంలో గట్టిగా తమ వాణిని వినిపించారు.రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఈ ఎన్నిక ఫలితం దిక్సూచి వంటిదని బలంగా నమ్మడంతో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో స్వయంగా ఎమ్మెల్యే ధర్మశ్రీ పాల్గొన్నారు. కుల సంఘాలు, ట్రేడ్ యూనియన్లు, పాల ఉత్పత్తిదారుల సంఘాలు, స్థానిక సంస్థల ప్రతినిధులతో పాటు గృహసారథలతో ఊపిరి సలపని స్థాయిలో సమావేశాలు నిర్వహించారు.పట్టభద్రులను వ్యక్తిగతంగా కలుసుకున్నారు. మరొకవైపు గడపగడపకు ప్రభుత్వం పేరిట ఇంటింటికి వెళ్లి గత నాలుగేళ్లలో వ్యక్తిగతంగా లబ్ధి పొందిన వివరాలను ఎమ్మెల్యే స్వయంగా వివరించారు.

నియోజకవర్గంలో పలుమార్లు వైసిపి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ కూడా మండలంలో పలు సమావేశాలలో పాల్గొన్నారు. రావికమతం మండలంలో సుమారు 15 సమావేశాలకు పైగా ఏర్పాటు చేశారు. అలాగే అత్యధిక ఓటర్లుగా నమోదైన మేడివాడ, టి.అర్జాపురం, కొత్తకోట, దొండపూడి, తోటకూరపాలెం, చిన్నపాచిల, రావికమతం ,తదితర గ్రామాలలో పట్టభద్రులను కన్వీనర్ల ద్వారా ఆయా గ్రామాలలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశారు. పాల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులను కూడా ఇందులో భాగస్వాములను చేసినప్పటికీ కనీసం ఫలితం లేకపోయింది.

ఇదేవిధంగా నాలుగు మండలాల్లో తరచు అనేక సమావేశాలు ఏర్పాటు చేసి ఓట్లు చేర్పించిన దగ్గర నుంచి ఓటు వేయించే వరకు అనేక రకాలుగా నిరంతరం కృషి చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో అధికార పార్టీ మండల స్థాయి, గ్రామస్థాయి నాయకత్వం డీలా పడింది.

ఇదిలా ఉండగా చోడవరం నియోజకవర్గం రావికమతం మండలం దొండపూడి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వేపాడ చిరంజీవి రావు ఉద్యోగిగా అనేక రకాలుగా యువకులతో పలు పరిచయాలు ఉన్నాయి. పలు కోచింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం, కాపు కమ్యూనిటీకి చెందిన వ్యక్తి కావడం ఆయనకు కలిసి వచ్చినట్లు భావిస్తున్నారు.

ఇదిలా ఉండగా నాయకులు, కార్యకర్తలను పట్టించుకోక పోవడంతో పలు గ్రామాల్లో ప్రచారం నిస్తేజంగా సాగింది. ప్రభుత్వం సంక్షేమ పథకాలు తప్ప అభివృద్ధి పథకాలు , గ్రామపంచాయతీల అభివృద్ధి, లేకపోవడంతో పలు గ్రామాల్లో పార్టీ నాయకులను పక్కన పెట్టి పాలన సాగించడం, కనీస గౌరవం కూడా వారికి లేకపోవడం, నేరుగా ముఖ్యమంత్రి ప్రజలకు నేరుగా బటన్ నొక్కి పథకాలు అందజేయడంతో అధికార పార్టీ నాయకులు అందరూ అసంతృప్తితో ఉన్నారు. ఏది ఏమైనా ఈ పరిస్థితి అధికార పార్టీ నాయకుల్లో బయటకు కనిపించని తీవ్ర నిరాశ నిస్పృహ నెలకొంది.

# పేరుకే గ్యాస్ గొడౌన్

### బండ నిల్వలు కరువు
### అధిక ధరలకు బ్లాకులో కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

ఇండేన్ గ్యాస్ గొడౌన్

**ప్రజాశక్తి-డుంబ్రిగూడ:** మండలంలోని గిరిజనుల సౌకర్యార్థం మండల కేంద్రంలో జిసిసి ఇండేన్ గ్యాస్ గొడౌన్ ఏర్పాటు చేసినప్పటికీ ఇక్కడ ఎప్పుడు సక్రమంగా గ్యాస్ బండ నిలువలు వినియోగదారులకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో, ఇండేన్ గ్యాస్ వినియోగదారులు షాపుల వద్ద బ్లాక్ లో అధిక ధరలకు కొనుగోలు చేసుకుని వినియోగించుకుంటున్నారు. దీంతో అధిక ధరలకు కొనుగోలు చేసుకోలేక అనేకమంది ఇండేన్ గ్యాస్ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిసిసి ద్వారా అధికారులు గ్యాస్ గొడౌన్ ఏర్పాటు చేసినప్పటికీ దాని నిర్వహణకు తగిన చర్యలు చేపట్టక పోవడంతో గ్యాస్ బండలు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదనీ, తప్పని పరిస్థితుల్లో బయట షాపుల వద్ద బ్లాక్ లో అధిక ధరలకు కొనుగోలు చేసుకుని వినియోగించుకుంటున్నామని మండలంలోని గిరిజనులు వాపోతున్నారు. మండలంలోని మారుమూల గ్రామాల్లో ఉన్న ఇండేన్ గ్యాస్ వినియోగదారులు గ్యాస్ విడిపించుకోవడానికి స్థానిక మండల కేంద్రంలోని జిసిసి గ్యాస్ గొడౌన్ వద్దకు వస్తున్నారు. ఆ సమయంలో గ్యాస్ బండల నిల్వ లేక పోవడంతో దూరప్రాంతం నుంచి లగేజీ చెల్లించి ఇక్కడకు వచ్చిన గిరిజనులు నిరాశతో వెను దిరుగుతున్నారు. కొన్ని సందర్భలలో గ్యాస్ గొడౌన్ సిబ్బంది కూడా అందుబాటులో ఉండటం లేదని గిరిజనులు తెలిపారు.సంబంధిత అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేక పోవడంతో గ్యాస్ గొడౌన్ ఉన్నప్పటికీ వినియోగదారులకు పూర్తిస్థాయిలో ఉపయోగం లేకుండా పోతుంది. తక్షణమే జిసిసి ఉన్నత అధికారులు స్పందించి గ్యాస్ గొడౌన్‌లో గ్యాస్ బండల నిల్వలు నిత్యం ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని మండలంలోని గిరిజనులు కోరుతున్నారు.

# పద్మాపురంలో అక్రమ నిర్మాణాలు

### పట్టించుకోని అధికారులు

కాఫీ మ్యూజియం వెనుక గిరిజనేతరులు కడుతున్న అక్రమ నిర్మాణం

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:** మండలంలోని పద్మాపురం మేజర్ పంచాయతీ పద్మాపురంలో పద్మావతీ గార్డెన్ కాఫీ మ్యూజియం వెనుకాల గిరిజనేతరులు భారీ అక్రమ కట్టడాలు చేపడుతున్నా మండల రెవెన్యూ అధికారులు, పంచాయితీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. గిరిజనులకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టం, పీసా, ఇతర గిరిజన చట్టాలు ఉన్నపటికి పూర్తిగా ఉల్లంఘిస్తూ గిరిజనేతరులు అక్రమ కట్టడాలు చేపడుతున్నా నిలుపుదల చేయవలసిన అధికారులు వారికి కొమ్ము కొమ్ము కాస్తు చూస్తు చూడనట్టు వ్యవహరిస్తున్నారు.ఎటువంటి అనుమతి లేకుండా భారీ నివాస గృహాలు నిర్మిస్తున్నారు. పంచాయతి అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడటం లేదు. దీంతో గిరిజనేతరులు మరింతగా రెచ్చి పోయి జోరుగా నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులు చేసినపట్టికి రెవెన్యూ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. ఓ గిరిజనుడు చిన్న బడ్డి పెట్టుకొని వ్యాపారం చేసుకుంటే రెవెన్యూ అధికారులు హుటాహుటిన తొలగిస్తున్నారు. అదే గిరిజనేతరులు భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నా చర్యలు తీసుకునే పరిస్థితి కనిపించ లేదు. నరేష్ అనే గిరిజనేతరుడు నిర్మిస్తున్న భారీ గృహ నిర్మాణ పై చర్యలు తీసుకోవాలని గిరిజన, ప్రజా సంఘాల నాయకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నేరాలు ఘోరాలు

## పిడుగుపడి యువకుడు మృతి

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలో పిడుగు పడి ఒక యువకుడు మృతి చెందాడు. మండలంలో యల్లవరం గ్రామానికి చెందిన అల్లు సతీష్ గొర్రెలను మేతకు తీసుకొని వెళ్ళిగా శనివారం సాయంత్రం పిడుగు పడి మృతి చెందాడు. వర్షం తగ్గిన తరువాత అక్కడకు సమీపంలో ఉన్న రైతులు చూసి అతని కుటుంబీకులకు సమాచారం అందించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## గృహోపకరణాలు దగ్ధం

**ప్రజాశక్తి -రావికమతం:** మండలంలో గుమ్మాలపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇంట్లో ప్రమాదం వాటిల్లింది. గుమ్మాలపాడు గ్రామంలో ఆదివారం గ్రామానికి చెందిన గొర్లె సత్తిబాబు ఇంట్లో హీటర్ స్విచ్ ఆన్ చేసి వది లేయడంతో ఇల్లంతా పొగలు కమ్మాయి. దీంతో మిక్సీ, గ్రైండర్ పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. దీంతో పెనుముప్పు తప్పింది. ఈ సందర్భంగా ఫైర్ సిబ్బంది మాట్లాడుతూ, ఇంట్లో వాడుతున్న వంటగ్యాస్, కుక్కరు, హీటరు, గ్రైండర్, ఎలక్ట్రికల్ పరికరాలు ఉపయోగంపై తగిన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

## పిడుగు పడి గేదె మృతి

**ప్రజాశక్తి-గొలుగొండ:** మండలంలోని గుండుపాల గ్రామ పంచాయతీ పరిధిలోని కామారెడ్డి రాజుకు చెందిన గేదెపై పిడుగుపాటుకు గురై మృతి చెందింది. గేదె మృతితో సుమారు 30 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టం పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

## సతీష్‌కు సాహితీ పురస్కారం

**ప్రజాశక్తి-మాడుగుల:** మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయుడు, కవి సీతా సతీష్ కు అరుదైన గౌరవం దక్కింది. ఆయన కవిత్వంలో రాణిస్తూ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడంతో తెలంగాణా రాష్ట్రం మంథనికి చెందిన శ్రీ గౌతమేశ్వర సాహితీ కళా సంస్థ ఆదివారం ఈయనకు ఉగాది నంది పురస్కారంతో పాటు, సాహితీ కిరణం బిరుదు ప్రదానం చేసి, పంచ లోహ కంకణం తొడిగి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన మహా కవి సమ్మేళనంలో సతీష్ అలల సవ్వడి అనే కవితను శ్రోతలకు వినిపించారు.సీతా సతీష్ కవిగా మరిన్ని అవార్డులు అందుకోవాలని సభలో పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సతీష్ కృతజ్ఞతలు తెలిపారు

## రోడ్లపై మురుగునీరు

**ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :** రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి పట్టణం తడిసి ముద్దయ్యింది. డ్రైనేజీ కాలవుల్లో నీరు రోడ్లపై పొంగి పొర్లుతుంది. చెత్త చెదారంతో రోడ్లు అధ్వాన్నంగా మారాయి.స్థానిక శారద నగర్, కొత్త వీధి, పెద్దబొడ్డేపల్లి థెరిసా కాలనీ, తదితర ప్రాంతాల్లో సిసి రోడ్లపై మురుగు నీటి కాలువల్లో నీరు చేరింది. అబీద్ సెంటర్లో నూకాలమ్మ తల్లి దేవాలయంలోకి వర్షపు నీరు విపరీతంగా చేరింది. కొత్త అమావాస్య సందర్భంగా ఇక్కడ జరుగుతున్న పండగ మహోత్సవంలో భాగంగా భక్తులు దేవాలయ దర్శనానికి వచ్చేటప్పుడు కొన్ని ఇబ్బందులకు గురయ్యారు. తుఫాను కారణంగా నియోజకవర్గ నాలుగు మండలాల్లోనూ వర్షపాతం నమోదు వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

## చీరలమాటున మొక్కజొన్న పంట!

**ప్రజాశక్తి-కోటవురట్ల:** మండలంలో చినబొడ్డేపల్లి గ్రామంలో మొక్కజొన్న పంటకు రక్షణగా రైతులు చీర కట్టారు. ఖరీఫ్ అనంతరం రబీలో విస్తారంగా సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు అడవి పందులు, కోతులు, పక్షులు, కాకులు నుండి పంటకు ఇటువంటి నష్టం వాటిల్లకుండా గ్రామస్తులు పంట చుట్టూ చీరలు కట్టారు. పంటలకు చీడపీడల నుంచి రక్షించుకోవడం ఒక ఎత్తు అయితే పంటను కాపాడుకోవడానికి రైతులకు మరి కాస్త అదనపు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు ఆరు కాలం కష్టపడి పెట్టుబడులు పెట్టి పండించినా గిట్టుబాటు ధర రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్న తరుణంలో పంటకు రక్షణ కలిగించుకునేందుకు మరి కాస్త వ్యయ ప్రయాసలు కోర్చాల్సి వస్తుందంటున్నారు.మండల వ్యాప్తంగా ఇటువంటి దృశ్యాలు దర్శనమిస్తున్నాయి.



మీడియాతో మాట్లాడుతున్న హీరో నాని

## విశాఖలో నాని 'దసరా' సందడి

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** దసరా సినిమా కుటుంబ సమేతంగా చూడదగ్గదని హీరో నాని పేర్కొన్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం నోవటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. హీరోయిన్ కీర్తి సురేష్‌తో తాను నేను లోకల్ సినిమా తరువాత చేసిన రెండో చిత్రం ఇదని తెలిపారు. ఈ సినిమా ఈ నెల 30వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతుందన్నారు. ఆ రోజు నుంచి ఒక పుష్ప, ఒక కెజిఎఫ్ -2 మాదిరిగానే దసరా సినిమా గురించి మాట్లాడతారన్నారు. సినిమాలో అంత బలమైన, నమ్మకమైన కంటెంట్ ఉందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ సినిమా బాగా తీశారన్నారు. పాటలకు ఇప్పటికే ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. సంతోష్ నారాయణ మంచి సంగీతం అందించారన్నారు. ఈ సినిమా అన్ని తరగతుల ప్రేక్షకులనూ అలరిస్తుందని తెలిపారు. మీడియా సమావేశంలో చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

## వింత వ్యాధులతో మూగజీవాలు మృత్యువాత

**ప్రజాశక్తి-విఆర్.పురం :** మండలములో గత వారం పదిరోజులుగా వింత వ్యాధులతో పదుల సంఖ్యలో పశువులు మేకలు గేదెలు మృత్యువాత పడుతున్నాయని పెంపకందారులు ఆవేదన చెందుతున్నారు. స్థానిక పశు వైద్యాధికారి తన పరిధిలో వైద్యం అందిస్తున్నప్పటికీ పూర్తి స్థాయిలో వ్యాధులు అదుపులోకి రాక మూగజీవాలు మృతిచెందుతున్నాయని గొర్రెల మేకలు పెంపకం దార్ల సంఘం, విఆర్ పురం మండల కమిటీ నేతలు తీవ్రంగా అవేదన వ్యక్తం చేశారు. ఆదివారము రేఖపల్లి, గొల్లగూడెంలో సోల ఏసుబాబుకు చెందిన గేదె ఉన్నట్టుండి మృత్యువాత పడింది. దీనిపై జిల్లా అధికారులకు తెలియజేసినప్పటికీ ఎటువంటి స్పందన లేదని బాధిత రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా పశువైద్య శాఖ అధికారులు స్పందించి రేఖపల్లి, గొల్లగూడెంలో ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించి, ముందుగా వ్యాధి నిర్ధారణ, తర్వాత నివారణ చర్యలు చేపట్టాలని గొర్రెల మేకలపెంపకందార్ల సంఘం మండల నాయకులు పంకు సత్తిబాబు, పినబోయిన ముత్తయ్య, మానికల సూరిబాబు, సోలా వినోద్, పినబోయిన శ్రీను డిమాండ్ చేసారు.

బోరు పనులను పర్యవేక్షిస్తున్న శివప్రసాద్

## శరభన్నపాలెంలో తాగునీటి బోరు

**ప్రజాశక్తి -కొయ్యూరు :** మండలం శరభన్నపాలెం గ్రామంలో ఎర్రగుండమ్మ తల్లి గుడి వద్ద అరకు ఎంపి గొడ్డేటి మాధవి చొరవ, ఆదేశాలతో 'నేను సైతం' ఛారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివప్రసాద్ మంచినీటి బోరు వేయించారు. ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంతో బోరు వేయించడంపై స్థానిక గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# అచ్చొచ్చిన మైదానంలో నిరాశ..!

### రెండో వన్డేలో ఆసీస్ చేతితో భారత్ ఓటమి
### నిప్పులు చెరిగిన మిచెల్ స్టార్క్
### కూలిన ఇండియా టాప్ ఆర్డర్
### దిగాలు పడ్డ అభిమానులు

రాహుల్‌ను అవుట్ చేసిన ఆనందంలో ఆసీస్ ఆటగాళ్లు

**ప్రజాశక్తి - పిఎం.పాలెం :** విశాఖ వేదికగా ఎసిఎ - విడిసిఎ స్టేడియంలో ఆదివారం జరిగిన భారత్ - ఆసీస్ రెండో వన్డే మ్యాచ్ స్థానిక అభిమానులకు నిరాశను మిగిల్చింది. భారత్‌కు అచ్చొచ్చిన మైదానంగా పేరొందిన ఈ స్టేడియంలో చాలా కాలం తర్వాత స్వదేశీ జట్టు చిత్తుగా ఓడిపోవడాన్ని అభిమానులు అంతగా జీర్ణించుకోలేకపోయారు. తమ అభిమాన క్రీడాకారులు అవుటై వెళ్లిపోతుంటే దిగాలుగా ఉండిపోయారు.

వన్డే మ్యాచ్‌తో మధురవాడ ప్రాంతం క్రికెట్ అభిమానులతో ఆదివారం ఉదయానికే సందడిగా మారింది. రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఈ మ్యాచ్‌లో భారత్ కేవలం 117 స్కోర్ మాత్రమే చేసింది. అనంతరం బ్యాటింగ్‌కి దిగిన ఆస్ట్రేలియా 11 ఓవర్లలో ఒక్క వికెట్ కూడా నష్టపోకుండా విజయాన్ని సొంతం చేసుకుంది. వర్షం కారణంగా మ్యాచ్ జరుగుతుందా ? లేదా ? అన్న ఆత్రుతతో ఎదురుచూసిన అభిమానుల్లో ఫలితం తీవ్ర నిరాశ మిగిల్చింది. వరుణుడు కరుణించినా భారత్ తీవ్ర పరాజయంతో భారత్ అభిమానుల్లో దిగాలు నెలకొంది. ఈ మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి గంటల తరబడి క్యూ లైన్లలో నిలబడి టిక్కెట్లు కొనుక్కున్నారు. కొందరు పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించి బ్లాక్‌లో కొనుక్కొని మరీ భారత్ ఆటను చూసేందుకు వచ్చారు. వారంతా నిరాశకు లోనయ్యారు.

**భారత్ ఫేవరెట్ మైదానమే అయినా...**

కోహ్లీ అవుటైన క్షణాన నిరాశలో అభిమానులు

ఈ స్టేడియం భారత్ టీంకి అచ్చొచ్చిందని చెప్పుకోవచ్చు. గతంలో జరిగిన పది మ్యాచ్లో ఒక మ్యాచ్ రద్దయింది. ఓ మ్యాచ్‌లో ఇండియా ఓడిపోయింది. మిగిలిన 8 మ్యాచ్‌లనూ గెలిచి రికార్డు సృష్టించింది. ఇదే స్టేడియంలో విరాట్ కోహ్లీ మూడు సెంచరీలు చేసిన ఘనత కూడా ఉంది. అంతేకాకుండా చివరి టెస్టులో కూడా విరాట్ కోహ్లీ సెంచరీ చేసి ఫామ్‌లో ఉన్నందున ఆదివారం విశాఖలో జరిగిన వన్డే మ్యాచ్‌లో కూడా అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తాడని అభిమానులు అనుకున్నారు. కానీ అతడు బ్యాటింగ్‌కి దిగి 31 పరుగులు మాత్రమే చేసి అవుటయ్యాడు. ఆసీస్ ముందు తక్కువ స్కోర్‌ని ఉంచి బౌలింగ్‌కు దిగిన భారత్ బౌలర్లు ఈ మ్యాచ్‌లో తేలిపోయారు. 11 ఓవర్లలోనే ఆసీస్ ఓపెనర్లు మ్యాచ్‌ను ఖతం చేశారు. రెండు జట్లూ కలిపి 37 ఓవర్లు మాత్రమే ఆడటంతో అభిమానులు నిరాశచెందారు.

**స్టార్క్ ప్రతిభ**

ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా బౌలర్ మిచెల్ స్టార్క్ ఐదు వికెట్లు తీసి ఉత్తమ ప్రతిభని కనబరిచి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. తను వేసిన ఫస్ట్ స్పెల్‌లో ఐదు ఓవర్లకే నాలుగు వికెట్లు తీసి ఇండియా టాప్ ఆర్డర్‌ను కూల్చివేశాడు. దీంతో లోయర్ ఆర్డర్ భారత్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా బౌలర్ల ముందు నిలవలేకపోయారు.

**అభిమానులకు సమాచారం కరువు**

చాలామంది అభిమానులు స్టేడియంలోకి ప్రవేశించేందుకు ఇబ్బందులు పడ్డారు. సరైన సమాచారం లేకపోవడంతో స్టేడియం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. మూడు చోట్ల పోలీసులు తనిఖీలు నిర్వహించడంతో చాలా మంది లైన్లో ఉండటానికే సమయం సరిపోయింది. ఇష్టమైన భారత్ క్రీడాకారులను తాము చూడలేకపోయామని చాలా మంది వాపోయారు. పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ నేరుగా బందోబస్తు ఏర్పాట్లు చూశారు. ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

# విశాఖకు విద్యుత్ బస్సులు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** విశాఖ నగరంలోకి విద్యుత్ బస్సులు రానున్నాయి. ఆరు మాసాలలో ఇవి రోడ్లపై పరుగులు తీయనున్నాయి. ప్రజా రవాణా విభాగం రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి ఎలక్ట్రిక్ (విద్యుత్) బస్సులను తెప్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా విశాఖ నగరానికి వంద విద్యుత్ బస్సులు కేటాయించే అవకాశం ఉందని ఆర్‌టిసి ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. విశాఖకు వంద ఎలక్ట్రిక్ బస్సులు అవసరమని ఈసరికే ప్రతిపాదనలు పంపామని, ఈ-బస్సులకు లైన్ క్లియర్ కావడంతో తొలివిడతలో 50, మలి దశలో మరో 50 వెరసి 100 బస్సులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఈ విద్యుత్ బస్సులు ఎయిర్ కండిషన్ సదుపాయాన్ని కలిగి ఉంటాయని, బ్యాటరీ సాయంతో నడవనున్నందున ఇవి దూర ప్రాంతాలకు అనువుగా ఉండవని వెల్లడించారు. ఈ నేపథ్యంలో వీటిని నగరంలో ఎంపిక చేసిన వివిధ ప్రాంతాలకు సిటీ సర్వీసులుగానే నడపనున్నట్లు తెలుస్తోంది. విశాఖపట్నం జిల్లాకు విద్యుత్ బస్సులతో పాటు మరో వంద వరకూ కొత్త డీజిల్ బస్సులు రానున్నాయని తెలిసింది. అంతా సజావుగా సాగితే ఆర్‌టిసిలో 13 లక్షల కిలోమీటర్లు తిరిగినా లేదా 15 ఏళ్లు పూర్తయిన బస్సులను తొలగిస్తారు. వాటి స్థానంలో కొత్త బస్సులను ప్రవేశపెడతారు. మరికొన్ని బస్సులను 9-10 లక్షల కిలోమీటర్లు తిరిగాక పల్లె వెలుగు సర్వీసులుగా బాడీని మార్పు చేసి నడుపుతారు. విశాఖ జిల్లాలో ప్రస్తుతం 15 ఏళ్లు పూర్తి చేసుకున్న బస్సులు 35 వరకూ ఉన్నాయి.

దగ్ధమవుతున్న ఇల్లు

## ఇల్లు దగ్ధం

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి:** రాజవొమ్మంగి గ్రామ శివారున ఆదివారం సాయంత్రం సంభవించిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. రూ.50 వేలు ఆస్తి నష్టం సంభవించింది, గ్రామస్తులు కథనం ప్రకారం రాజవొమ్మంగి గ్రామ శివారున నివాసముంటున్న ఆవాల అబ్బులుకు చెందిన తాటాకింటికి ఇంట్లోని వారంతా కూలి పనులకు వెళ్లి, ఎవరూ లేని సమయంలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు,. స్థానిక యువకులు ఇంట్లో ఉన్న సామాన్లను గ్యాస్ సిలిండరును బయటకు తీసివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదానికి కారణాలు తెలియాల్సి ఉంది.

## 100 మందికి ఉచిత కంటి పరీక్షలు

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి :** మండలంలోని వట్టిగెడ్డ గ్రామంలో సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ వెంకటరమణ అధ్యర్యంలో కాకినాడ అంజు కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఆదివారం మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించి, వంద మందికి ఉచితంగా నేత్ర పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు ఇచ్చారు. ఈ సందర్భగా 19మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి కాకినాడ ఆసుపత్రికి తరలించి ఉచితంగా చేస్తామని డాక్టర్ రాజు తెలిపార. శిబిరంలో అంజు కంటి ఆసుపత్రి సిబ్బంది స్వామి వందనం, సూర్యనారాయణ,విద్యా సాగర్,ఆయుష్ చంద్ర, విజయ్, నాగేంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు

## యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా రాజబాబు

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి :** అల్లూరి సీతారామరాజు జిల్లా యుటిఎఫ్ జిల్లా కార్యదర్శిగా సొర్లం రాజబాబు రెండోసారి ఎన్నికయ్యారు. ఆదివారం చింతూరులో నిర్వహించిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక జరిగింది. యూనియన్ రాష్ట్ర కోశాధికారి గోపిమూర్తి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి విల్సన్‌బాబు , మహేష్ అధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో జిల్లా కార్యదర్శిగా రాజబాబు, జిల్లా అడహక్ కమిటీ సభ్యులుగా పి.మంగరాజు, జిల్లా మహిళా కమిటీ సభ్యురాలిగా బి.వెంకటలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై యుటిఎఫ్ రాజవొమ్మంగి మండల అధ్యక్ష, కార్యదర్శులు పైడిమల్లు, రమణ హర్షం వ్యక్తంచేసి వారికి అభినందనలు తెలిపారు అభినందనలు తెలిపిన వారిలో జిల్లా కౌన్సిలర్ ఉదయ్, మిరియాల రమేష్, సుబ్బారావు, అడ్డాల సతీష్, సత్యవతి, ప్రసన్న, కానెమ్ శ్రీను, సాధన పల్లి సత్యనారాయణ, లింగేటి గంగరాజు, రామకృష్ణ, అర్జమ్మ, లోవరాజు, గణేష్ ఉన్నారు.

## మారెమ్మ వార్షికోత్సవ నిర్వహణపై సమీక్ష

**ప్రజాశక్తి -సీలేరు:** సీలేరు మారెమ్మ తల్లి 51వ వార్షికోత్సవ నిర్వహణపై ఆలయ కమిటీ ఆదివారం సమావేశమై చర్చించింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు కారె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఈ ఏడాది మారెమ్మ ఉత్సవాలను ఎపుడు, ఎలా నిర్వహించాలనే దానిపై ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్న ఉత్సవ కమిటీ వార్షికోత్సవ తేదీలను ఖరారు చేసింది. ఏటా ఆనవాయితీగా నిర్వహిస్తున్న మాదిరిగానే తమిళ సంవత్సరాది వచ్చేనెల 14న జెండా ఆవిష్కరణతో వార్షికోత్సవాలను ప్రారంభించి, 16న అమ్మవారి గరగ అలంకరణ, అగ్నిగుండం నిర్వహిస్తారు. 21న అన్నవరం దేవస్థానానికి చెందిన భక్తులతోఅమ్మవారికి ప్రత్యేక అలంకరణ, సామూహిక కుంకుమ పూజలు దీపాలంకరణ, 22న అమ్మవారు తిరువీధి ఉత్సవం, 23న అమ్మవారి ప్రధాన పండుగ, 24న చన్నీటి ఉత్సవం, 26న మారెమ్మకు మారుపూజ నిర్వహించాలని వార్షికోత్సవ తేదీలను ఖరారు చేశారు. ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షులుగా ఎపి జెన్‌కో ఎఇ సురేష్, కార్మికుడు టకిరి బుట్టోలను ఆలయ కమిటీ నియమించింది. వార్షికోత్సవం విజయవంతం చేయడానికి అందరూ కృషి చేయాలని కోరారు.